దసరా బరిలో కింగ్ 100?

అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం తన వందో చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు 'కింగ్100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా షూటింగ్‌ను కంప్లీట్ చేసి పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెడతారని సమాచారం. ఓ సామాన్యుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, ఇందులో నాగార్జున విభిన్న కాలాల్లో, డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. ఏఐ సాంకేతికతతో నాగార్జున రెట్రోలుక్స్‌ని రీక్రియేట్ చేయబోతున్నారని తెలిసింది. ఆయన లుక్స్‌తో పాటు క్యారెక్టర్ ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు.

నిజామాబాద్
శుక్రవారం
5.06.2026

సంపుటి : 16 సంచిక: 250
పేజీలు:6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

చిత్రం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

లొంగిపోయిన మావోయిస్టుల పయనమెటు?

- రాజకీయ పక్షాల నుంచి ఆహ్వానాలు
- సీపీఐ, టీఆర్పీ, టీఆర్ఎస్ నేతల పిలుపులు
- ఇటీవల సీపీఐ నేతలతో కొందరు భేటీ
- ఆచితూచి అడుగులేస్తున్న పలువురు నేతలు
- కొత్త నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి
- లొంగిపోయిన వారిపై పోలీసు నిఘా నేత్రం

చట్టం, స్టేట్ బ్యూరో:

భారీ సంఖ్యలో వరుసగా ప్రభుత్వం ముందు లొంగిపోయిన మావోయిస్టుల పయనమెటు? అనే ప్రశ్నలు కొద్ది నెలలుగా ఉత్పన్నమవుతున్నాయి. ప్రధానంగా మావోయిస్టు పార్టీలో కీలక భూమిక పోషించి, లొంగిపోయిన తెలంగాణ, ఏపీకి చెందిన అగ్రనేతల దారెటు అనే విషయంలో వామపక్ష సమూహాల్లో కొంత ఆసక్తి కూడా నెలకొంది. లొంగిపోయిన సందర్భంలో అగ్ర నేతల్లో కొందరు తమ తమ పరిస్థితుల మేరకు వివిధ కారణాలను, తమ మనోభావాలను వ్యక్తం చేశారు. ఇందులో కొందరు తాజా పరిస్థితుల్లో మరో మార్గం లేక లొంగిపోయినట్లు ప్రకటిస్తూనే తాము ఇంతకాలం నమ్మిన రాజకీయ, సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని తేల్చిచెప్పారు. సాయుధులుగా కాకుండా రాజ్యాంగ చట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామిక ఆకాంక్షల కోసం పోరాడుతామని ప్రకటించారు. ఎక్కడ ఉన్నా.. తమ ప్రజా 'రాజకీయ కార్యాచరణ' కొనసాగుతుందని స్పష్టతనిచ్చారు. కొందరు నాయకులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో ఎవరి అభిప్రాయాలు ఏమైనప్పటికీ మావోయిస్టు పార్టీ మాజీ నేతలను కొన్ని రాజకీయ పక్షాలు తమతమ పార్టీల్లో చేరాలంటూ ఆహ్వానించడం విశేషం. మావోయిస్టులు తుపాకులు విడిచిపెట్టి తమ పార్టీల్లో చేరాలంటూ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్‌తోపాటు వివిధ పార్టీల నేతలు బహిరంగంగా ఆహ్వానాలు పలికిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎన్టీఆర్ లాంటి వారు నక్సలైట్లు దేశ భక్తులంటూ కీర్తించిన చరిత్ర ఉంది. తాజా సీఎం రేవంత్ రెడ్డి కూడా మావోయిస్టులకు తమ పార్టీల్లో చేరాలంటూ ఆహ్వానం పలికిన సందర్భాలున్నాయి. కొన్ని సందర్భాల్లో నక్సలైట్లు కేంద్రంగా రాష్ట్ర రాజకీయాలు, చర్చలు సాగిన చరిత్ర కూడా ఇటీవల కాలం వరకు ఉన్న విషయం మరిచిపోలేమంటున్నారు.

రాజకీయ పక్షాల బహిరంగ ఆహ్వానం

ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు, కార్యకర్తలు తమ తమ రాజకీయ పార్టీల్లో చేరి తమ సామాజిక జీవితాన్ని కొత్తగా ప్రారంభించాలంటూ ఆయా పార్టీల నేతలు ఆహ్వానించడం గమనార్హం. దశాబ్దాలుగా త్యాగ నిరతితో పీడిత ప్రజల కోసం పనిచేసిన ఈ నాయకులు 'పరిస్థితులు' అనుకూలించని తాజా వాతావరణంలో తమ జీవితాలను ప్రజల కోసమే వినియోగించేందుకు తమ పార్టీలను వేదికలుగా మార్చుకోవాలంటూ హితవు పలుకుతున్నారు. బహిరంగ ఆహ్వానాలతో పాటు తమ పరిధిలో ఉన్న పరిచయాలు, అనుబంధాల మేరకు ఆయా వ్యక్తులు, శ్రేణులకు ప్రత్యేక ఆహ్వానాలు అందిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ఆహ్వానాలు పంపుతున్న పార్టీలు తెలంగాణలో ఎక్కువగా ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీగా సీపీఐ ముందున్నది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి మాజీ మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సంగ్రామ్, చంద్రన్న తదితరులు కొద్ది రోజుల క్రితం వెళ్ళి ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకత్వంతో సమావేశమయ్యారు. అటవిబాట వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులంతా సీపీఐలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కగార్ అపరేషన్‌కు వ్యతిరేకంగా సీపీఐ, పీపీఎం తదితర వామపక్షపార్టీలతో పాటు ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, మేధావులు అనేకమంది అనేక రూపాలలో ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు అడవుల్లో ఉన్న మావోస్టులు ప్రాణాలు కాపాడబడాలని కోరుకున్నారని గుర్తు చేశారు. తమ మధ్య మర్యాదపూర్వక సమావేశం జరిగిందని రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు జరిపి, వారి భవిష్యత్తు ఏమిటి అనే దానిపై చర్చిస్తామని కూనంనేని వెల్లడించారు. తమ ఆలోచనలను వారితో పంచుకుని, తెలంగాణకు, దేశానికి మంచి జరిగే నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. దేశంలో మతోన్మాద, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా బలంగా నిలబడగల శక్తి కమ్యూనిస్టు ఉద్యమానిదేనని అభిప్రాయపడ్డారు. దేవ్‌జీ మాట్లాడుతూ సీపీఐ నేతలను మర్యాద పూర్వకంగా కలిసేందుకే వచ్చామని వెల్లడించారు. ఇక సీపీఎం బహిరంగంగా ఆహ్వానం పలకకపోయినప్పటికీ ఆ పార్టీలోని జీ రాములు లాంటి కొందరు నాయకులు మావోయిస్టు మాజీ నేతలు తమ భవిష్యత్ జీవితాలను ప్రజా 'రాజకీయ' కార్యకలాపాల్లో కొనసాగించాలంటూ సూచిస్తున్నారు. ఇక బీసీలు, సామాజిక న్యాయం పేరుతో కొత్తగా తెరపైకి వచ్చిన తీన్మార్ మల్లన్న ఏర్పాటు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ, కేసీఆర్ కుమార్తె కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు మాజీ మావోయిస్టులకు ఆహ్వానం పలుకుతున్నారు. ఇటీవల మాజీ మావోయిస్టు నాయకురాలు పటేల్ వనజ ఆధ్వర్యంలో పలువురు మాజీ మావోయిస్టు కేడర్ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో టీఆర్పీలో చేరారు.

గతంలో భిన్నమైన పరిస్థితి

దశాబ్దాలుగా దేశంలో మావోయిస్టులు పనిచేస్తున్న నేపథ్యంలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు వివిధ కారణాలతో లొంగిపోయిన సందర్భాలూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొందరు తమ అజ్ఞాత జీవితంలో అరెస్టు తర్వాత బహిరంగ జీవితాలు కొనసాగించిన వారున్నారు. మావోయిస్టు అగ్రనేతలు సత్యమూర్తి, కొండపల్లి, ముక్కు సుబ్బారెడ్డితో పాటు మరి కొందరు తమ రాజకీయ భిన్నాభిప్రాయాలు, అనారోగ్య కారణాలతో లొంగిపోయిన సంఘటనలున్నాయి. ఇలా లొంగిపోయినవారు, అరెస్టు అయిన వారు తమ తమ వ్యక్తిగత సంసిద్ధత మేరకు తమ అనుకూల రాజకీయ పార్టీల్లో, ప్రజాసంఘాల్లో చేరారు. కొందరు కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, సీపీఐ ఇతర పార్టీల్లో చేరారు. ఒకరిద్దరు బీజేపీలో చేరారు. కొంత మంది ఆ తర్వాత క్రమంలో తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు. రాజకీయ పార్టీల్లో చేరి స్థానిక ప్రజాప్రతినిధులుగా, ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేస్తున్న వారున్నారు. మరి కొందరు వ్యక్తిగత జీవితాలను కొనసాగిస్తూ వచ్చారు. ఈ దశాబ్దాల కాలంలో ఈ విధంగా లొంగిపోయిన వారి సంఖ్య భారీగానే ఉన్నప్పటికీ తమతమ వ్యక్తిగత నిర్ణయాల మేరకు జీవితాలను కొనసాగిస్తూ వచ్చారు. ఈ లొంగుబాట్లకు భిన్నంగా కగార్ ఆపరేషన్ తీవ్రత తర్వాత ఈ మధ్యకాలంలో పెద్ద సంఖ్యలో వరుసగా మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇందులో దశాబ్దాలుగా అజ్ఞాత జీవితాలు కొనసాగించిన ముఖ్యమైన నేతలు, కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు, వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీకి నాయకత్వం వహించిన వారు ఉన్నారు.

అమీర్‌పేట్‌లో అగ్నిప్రమాదం

- ప్రమాద స్థలానికి పిల్లర్ దగ్గరగా ఉంది
- అందుకే మెట్రో పిల్లర్‌ను చెక్ చేశాం
- మెట్రో పిల్లర్‌కు ఎలాంటి డ్యామేజీ జరగలేదు
- ప్రకటన బోర్డు కాలి.. దాని లిక్విడ్ పిల్లర్‌పై పడింది. మెట్రో అధికారులు

చట్టం, స్టేట్ బ్యూరో:

అమీర్‌పేట్ అగ్నిప్రమాదం నేపథ్యంలో మెట్రో పిల్లర్‌కు పగుళ్లు (క్రాక్స్) వచ్చాయంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న వార్తలపై హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు స్పందించారు. ఈ వార్తలను వారు పూర్తిగా ఖండించారు. మెట్రో పిల్లర్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్నిప్రమాదం జరిగిన వ్యాపార సముదాయానికి మెట్రో పిల్లర్ చాలా దగ్గరగా ఉంది. ఈ ప్రమాదం కారణంగా పిల్లర్‌కు ఏమైనా నష్టం జరిగిందా అని నిర్ధారించుకోవడానికి మాత్రమే ముందస్తు జాగ్రత్తగా నిపుణులతో తనిఖీలు చేయించామన్నారు.

ప్రకటన బోర్డు కాలి.. దాని లిక్విడ్ పిల్లర్‌పై పడింది..

ఈ తనిఖీల్లో మెట్రో పిల్లర్ నిర్మాణానికి ఎలాంటి డ్యామేజీ జరగలేదని, అది పూర్తిగా సురక్షితంగానే ఉందని తేలింది. (Ameerpet Fire Accident) పిల్లర్ పై ఉన్న ఒక ప్రకటన బోర్డు (Ad Board) మంటలకు కాలిపోవడంతో, దానికి సంబంధించిన కెమికల్ లిక్విడ్ కారుతూ వచ్చి మెట్రో పిల్లర్‌పై పడింది. ఆ లిక్విడ్ మరకల వల్ల పిల్లర్‌పై పగుళ్లు వచ్చినట్లు బయటకు కనిపించిందే తప్ప, వాస్తవానికి పిల్లర్‌కు ఎలాంటి క్రాక్స్ రాలేదని అధికారులు వివరణ ఇచ్చారు. మెట్రో సర్వీసులు ఎప్పటిలాగే పూర్తి సురక్షితంగా నడుస్తాయని, పుకార్లను నమ్మవద్దని మెట్రో అధికారులు కోరారు.

ఇండియా కూటమికి డీఎంకే దూరం

చట్టం, న్యూఢిల్లీ :

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పునరేకీకరణల నేపథ్యంలో ఇండియా కూటమికి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే దూరం జరగాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 8న ఢిల్లీలో జరుగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కారాదని డీఎంకే నిర్ణయించుకున్నది. దీంతో ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్‌తో ఆ పార్టీ సంబంధాలు మరింత బీటలు వారుతున్నట్లు తెలుస్తున్నది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాని నేపథ్యంలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న టీవీకేను గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో డీఎంకేతో పొత్తు పెట్టుకొని పోటీచేసిన కాంగ్రెస్ ఆ తరువాత ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు పలికింది. ఈ పరిణామం డీఎంకే నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. కాంగ్రెస్ తమను మోసం చేసి వెన్నుపోటు పొడిచిందని డీఎంకే నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం దశాబ్దాల తమ స్నేహానికి తూట్లు పొడిచిందని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకున్న నేపథ్యంలో పార్లమెంట్‌లో తమకు వేరుగా సీట్లు కేటాయించాలని డీఎంకే ఎంపీ కనిమొళి ఇటీవల లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనుసరించాల్సిన సంయుక్త వ్యూహంపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరుగనున్న ఈ సమావేశానికి ఇండియా కూటమిలోని 15 పార్టీల ప్రతినిధులు హాజరు కానున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని రెండు ప్రధాన భాగస్వాములైన తృణమూల్, డీఎంకే పార్టీలు ఓటమి పాలైన నేపథ్యంలో ఈ సమావేశం జరుగనుండటంతో ప్రాధాన్యం సంతరించుకున్నది.

జూన్ 14 వరకు వేసవి సెలవులు పొడిగింపు

చట్టం, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది.

స్కూళ్లతో పాటే అంగన్‌వాడీలు కూడా..

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవోత్వరలోనే విడుదల కానున్నాయి.

మెట్రో వ్యవస్థకు ఎలాంటి నష్టం లేదు

- అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై స్పందించిన హెచ్ఎంఆర్ఎల్ ఎండీ
- మెట్రో స్తంభాలకు ఎలాంటి నష్టం జరగలేదన్న అధికారులు
- కాలిపోయింది వినైల్ షీట్లే.. పుకార్లను ఖండించిన మెట్రో యాజమాన్యం
- పాగతో ప్రయాణికులకు ఇబ్బంది.. యథావిధిగా కొనసాగిన మెట్రో సర్వీసులు

చట్టం, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ మైత్రివనం సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL) ఉన్నతాధికారులు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం కారణంగా పక్కనే ఉన్న మెట్రో రైలు వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు. మెట్రో రైలు సర్వీసులు ఎప్పటిలాగే పూర్తి సురక్షితంగా, సాధారణంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే మెట్రో సిబ్బంది అప్రమత్తమై ప్రభావితమైన ఆస్తులపై లోతైన అంచనా వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ వ్యాపించడం వల్ల ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగిన మాట వాస్తవమేనని, అయితే దీనివల్ల మెట్రో రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదని, రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయని ఎండీ వివరించారు. కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. మెట్రో స్తంభాలపై (పిల్లర్లపై) అమర్చిన ప్రకటనల బోర్డుల వినైల్ షీట్లు మాత్రమే మంటల తీవ్రతకు కాలిపోయాయని, అంతకుమించి మెట్రో వ్యవస్థ యొక్క ప్రధాన నిర్మాణాలు, కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. అందువల్ల మెట్రో ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో ప్రయాణం పూర్తిగా సురక్షితమని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ భరోసా ఇచ్చారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్

చట్టం బీబీపేట్ : బీబీపేట్ మండల కేంద్రంలోని పదవ వార్డులో గురువారం స్థానిక సర్పంచ్ సాత్విక సాయినాథ్ అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఆసీఫ్ మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ సమస్య ప్రధాన సమస్యగా మారడంతో అత్యవసర పనులుగా గుర్తించి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందుపట్ల ప్రశాంత్, కార్యదర్శి గూడ రమేష్, కారోబార్ సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

బుర్గుల్ గ్రామంలో ప్రజా పాలన గ్రామసభ ఏర్పాటు

చట్టం గాంధారి; గాంధారి మండలం బూర్గుల్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ సౌమ్య అధ్యక్షతన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా డిఆర్డిఓ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సభలో మురికి నీటి కాలువలు విద్యుత్ దీపాలు మంచినీటి సరఫరా అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మినీ మేడారం జాతరలో పాల్గొన్న : ఎమ్మెల్యే జారే

చట్టం అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గోపన్నగూడెం గ్రామంలో ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల జాతర (మినీ మేడారం) గ్రామస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గ్రామస్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్ర రావు, జిల్లా పీసీసీ ప్రముఖులు తుమ్మా రాంబాబు, జిల్లా పీసీసీ సభ్యులు కోలా లక్ష్మీనారాయణ, సర్పంచ్ లు అలీబాబు, సంక్రురావు, ఉపసర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తే సహించం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

చట్టం పెద్దపల్లి : తెలంగాణ యువత ఒక్క విషయం స్పష్టంగా గమనించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వంటి నాయకుల మాటలు నమ్మి యువత తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేసుకోవద్దని సూచించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, తెలంగాణ ప్రజలు ఆ పాలనను దగ్గర నుంచి చూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలోనే సుమారు 50 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టిందని తెలిపారు. యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించాల్సింది పోయి, బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేసే వారిని ప్రజలు క్షమించరని అన్నారు. యువతను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తెలంగాణ యువత అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, రాష్ట్ర పురోగతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. వాస్తవాలను గుర్తించి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని తెలంగాణ యువతకు ఆయన పిలుపునిచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తుల వినతి

చట్టం లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామ ప్రధాన కూడలి వద్ద బీటీ రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర పరిస్థితిలో ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి సమీపంలో ఉండటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, వాహనదారులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద భద్రతా చర్యలు అత్యవసరమని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ లీకేజీలు లేదా ఇతర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఐఐఐటి సీటు సాధించిన విద్యార్థినికి ఘనంగా సన్మానం

చట్టం న్యూస్ లింగంపేట్ : బాసర ఐఐఐటి లోనీటు సాధించిన భవానీపేట్ గ్రామానికి చెందిన విద్యార్థిని గాండ్ల దీపిక యాదవ్ ను అటవీశాఖ అధికారులు శాలువ, మేమేంటో తో ఘనంగా నిసన్మానించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు వినోద్, భాస్కర్ లు దీపిక యాదవ్ 562 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో నుండి మండల్ టాపర్ గా నిలిచినందుకు ప్రత్యేకంగా అభినందించారు.

అడవులు ప్రాముఖ్యత అంశం పై లో వ్యాస రచన, చిత్రాలేఖనం పోటీలు

చట్టం న్యూస్ లింగంపేట్ : మండల కేంద్రంలోనివిజయసాయి కంప్యూటర్ కోచింగ్ సెంటర్ గురువారం తెలంగాణ ప్రజా ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా తెలంగాణ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విజయసాయి కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ గజవాడ విద్యాసాగర్ ద్వారా వివిధ పాఠశాల విద్యార్థులకు అడవులు ప్రాముఖ్యత అంశం లో వ్యాస రచన మరియు చిత్రాలేఖనం పోటీలు మెంగారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫిసర్ భాస్కర్ మరియు ఎర్రపహడ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫిసర్ వినోద్ లు నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వినోద్ మరియు భాస్కర్ లు మాట్లాడుతూ అడవుల పెంపకము ఆవస్యాకత గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా చాలా చక్కగా వివరించారు. జీవ మనుగడకు ఆధారం అడవులని, ప్రతి ఒక్కరు తమ వంతుగా కనీసం రెండు చెట్లని నాటలని విద్యార్థులకు సూచించారు.పోటీలలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులను అందజేశారు. మొదటి విజేత వడ్ల హారిక 2వ విజేత కొమ్ముల సంజన, 3వ విజేత శ్రీ అశ్వంత్ మరియు ప్రోత్సాహక బహుమతి గజవాడ మైవిక లకు ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో FBO లు చంద్రశేఖర్, భాస్కర్ రావు, కళ్యాణి, శ్రీజ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భావి తరాల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యం – సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

చట్టం నిజామాబాద్ ప్రతినిధి : భావి తరాలకు నష్టం వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామ సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణం ఉన్న ప్రాంతాలే వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే విలేజ్ పోలీస్ ఆఫీసర్ లేదా సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, సైబర్ భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, తడి-పొడి చెత్త వేర్వేరు సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. గ్రామ సభలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఏసీపీ ప్రకాశ్ యాదవ్, సీఐ సురేష్ కుమార్, ఎస్సై సుస్మిత, సర్పంచ్ చంద్రకళ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్ణాటకలో వేములవాడ మార్కెట్ కమిటీ బృందం పర్యటన

- మార్కెట్ యార్డుల ఆధునీకరణే ధ్యేయం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్

చట్టం న్యూస్, వేములవాడ రూరల్ : కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లా సింధనూరు నియోజకవర్గంలో గల ప్రసిద్ధ జనతాగంజ్ మార్కెట్ యార్డును వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ పర్యటనలో భాగంగా అక్కడి మార్కెట్ యార్డు పనితీరును, విక్రయాల ప్రక్రియను నిశితంగా పరిశీలించింది. ఈ సందర్భంగా సింధనూరు జనతా గంజ్ మార్కెట్ యార్డులో రైతులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, పంట ఉత్పత్తుల కొనుగోలు విధానాలు, వేలం ప్రక్రియ, మరియు డిజిటల్ చెల్లింపుల నిర్వహణ తీరును అక్కడి స్థానిక అధికారులను, వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పంటల నిల్వ సామర్థ్యం, గిడ్డంగుల నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలను ఈ బృందం క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఇతర రాష్ట్రాల్లోని అత్యుత్తమ, ఆధునిక మార్కెటింగ్ విధానాలను పరిశీలించడం ద్వారా మన ప్రాంతంలో కూడా వాటిని అవలంబించి, వేములవాడ పరిసర ప్రాంత రైతులకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చని పాలకవర్గ ప్రతినిధులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సాధించిన అనుభవాలు వేములవాడ మార్కెట్ యార్డ్ ఆధునీకరణకు, రైతులకు మేలైన వసతులు కల్పించడానికి ఎంతగానో దోహదపడతాయని వారు స్పష్టం చేశారు.ఈ అధ్యయన పర్యటనలో వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, పాలకుర్తి పరశురాము, ఖమ్మం గణేష్, మానుపాటి పరుశురాములు, చెరుకు శంకర్లతో పాటు ప్రముఖ నాయకులు కూరగాయల కొమురయ్య, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, పండుగ ప్రదీప్, రంగు వెంకటేష్, రొమాల ప్రవీణ్ తో పాటు పలువురు ప్రాంతీయ రైతులు మరియు మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ అరెస్ట్

- తులంన్నర బంగారం, పిస్టల్ స్వాధీనం
- 61 కేసుల్లో నిందితుడి ప్రమేయం

చట్టం, వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ పట్టణంలోని మణికంఠ నగర్ కాలనీలో గత నెల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్‌ను అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి తులంన్నర బంగారు ఆభరణాలు, 5 ఎంఎం పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గత నెల 1వ తేదీన రాత్రి సమయంలో ఓ ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, రూ.2.10 లక్షల నగదును అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు ప్రధాన నిందితుడిని గుర్తించి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అదుపులోకి తీసుకున్నారు.

16 ఏళ్లకే నేరజీవితం

విచారణలో వికాస్ సింగ్ 16 ఏళ్ల వయసులోనే నేరాలకు అలవాటుపడినట్లు వెల్లడైంది. సంగారెడ్డి, బొల్లారం ప్రాంతాల్లో గతంలో 34 చోరీ కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించిన అతడు 2024లో విడుదలైన తర్వాత కూడా నేరాలను కొనసాగించాడు. వికారాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో మొత్తం 27 రాత్రి పూట చోరీలకు పాల్పడి 157 తులాల బంగారం, 256 తులాల వెండి, రూ.8.22 లక్షల నగదును దోచుకున్నట్లు ఒప్పుకున్నాడు.

దొంగసొమ్ముతో విలాసవంతమైన జీవితం

దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడిపిన నిందితుడు తన స్వగ్రామంలో 'హెల్పింగ్ హ్యాండ్' పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడైంది. పేద విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్లు పంపిణీ చేయడంతో పాటు స్నేహితులను పర్యాటక ప్రాంతాలకు విహారయాత్రలకు తీసుకెళ్లి స్థానికంగా మంచి వ్యక్తిగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.

బంగారం వ్యాపారుల ప్రోత్సాహం

దొంగిలించిన బంగారు ఆభరణాలను ఉత్తరప్రదేశ్‌లో ని కొందరు బంగారం వ్యాపారులకు విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ వ్యాపారులు దొంగసొమ్మును కొనుగోలు చేయడమే కాకుండా మరిన్ని చోరీలకు ప్రోత్సహించినట్లు నిందితుడు వెల్లడించాడు. అక్రమంగా తుపాకి కొనుగోలు చేసేందుకు కూడా ఆర్థిక సహాయం అందించినట్లు ఒప్పుకున్నాడు.

రిసీవర్లపై కేసులు

దర్యాప్తులో బంగారం వ్యాపారులు సంఘటిత నేరాలకు సహకరించినట్లు తేలడంతో వారిపై కూడా ఆర్గనైజ్డ్ క్రైమ్, ఆర్మ్స్ యాక్ట్ తదితర చట్టాల కింద కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుడికి సహకరించిన వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. అత్యంత ప్రతిభావంతంగా, చాకచక్యంగా వ్యవహరించి అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్న, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్, వారి సిబ్బందిని వికారాబాదు ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులను ప్రకటించారు.

పలు శాఖ అధికారులతో గ్రామసభ నిర్వహించిన తహసిల్దార్

చట్టం రెంజల్ : రెంజల్ మండలం, కల్యాపూర్ గ్రామంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం తహసిల్దార్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పరిధి లోని పలు శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఘనంగా గ్రామసభ నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మురికినీరు నిలువ లేకుండా, ప్రజలు క్రిమి కీటకాలు బారిన పడకుండా, ఎప్పటికప్పుడు పర్యవేక్షతో త్వరితగతిన పనులను చేపట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని సూచించారు. గ్రామంలోని పొడి చెత్త, తడి చెత్త వేరుగా పోగు చేసి కంపోస్టు సులువుగా తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. గ్రామంలో ప్లాస్టిక్ కవర్ లను నిషేధించడానికి పలు శాఖ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించి నిషేధించడానికి భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ రెమ్మ భానుచందర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్, అంగన్వాడి టీచర్ కవిత, వీణా, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఎక్లాస్ పూర్ గ్రామంలో గ్రామసభ

- మండల ప్రజా పరిషత్ అధికారి గాంభిరావుపేట తిరుపతి

చట్టం పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం అంతర్గాం మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశాల ఎక్లాస్పూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభను సర్పంచ్ జూపాక మమత శ్రీనివాస్ అధ్యక్షతన, మండల ప్రజాపరిషత్ అధికారి గాంభీరావుపేట తిరుపతి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జూపాక మమత శ్రీనివాస్, ఉప సర్పంచ్ లగిశెట్టి రాకేష్, మండల ప్రజా పరిషత్ అధికారి గాంభీరావుపేట తిరుపతి, ఎంపీ ఓ బైరవేణు మాధవ్, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై. కృష్ణ కుమార్, అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బోయ వెంకటస్వామి, విద్యుత్ శాఖ ఎఇ ఆశ శంకర్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ ఎ ఇ ఇ, వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాలసభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ అర్హతలు లేకుండానే వైద్యం

- గతంలో సీచ్ చేసిన మళ్ళీ కొనసాగుతున్నక్లినిక్ లు
- ప్రియాంక, భారతి క్లినిక్‌లను సీజ్ చేసిన డీఎంహెచ్ఓ

చట్టం ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కమలా నెహ్రూ కాలనీలో నిర్వహిస్తున్న ప్రియాంక, భారతి క్లినిక్‌లపై జిల్లా వైద్యాధికారి డా. రాజశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గురువారం రోజు సీజ్ చేశారు. సంబంధిత నిర్వాహకులు అర్హత కలిగిన వైద్య సర్టిఫికెట్లు లేకుండానే వైద్యం అందిస్తున్నట్లు గుర్తించిన అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో కూడా నిర్వాహకులపై కేసు నమోదైనప్పటికీ తిరిగి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స పొందాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డిఎంఎచ్ఓ రవీందర్, హెల్త్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లో ఉన్న స్కావెంజర్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

చట్టం సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట జిల్లా నూతన డిఈఓ గా వరగంటి శాస్త్రి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ పక్షాన నూతన డీఈవో ని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్యాల విజేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు ఎస్. కనకయ్య తో కలిసి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతి రెడ్డి డీఈవో తో మాట్లాడుతూ 202425 సంవత్సరానికి సంబంధించి స్కావెంజర్ వేతనాలు నాలుగు నెలలు పెండింగ్లో ఉన్నాయని, మరియు 202526 సంవత్సరానికి సంబంధించి మూడు నెలల స్కావెంజర్ వేతనాలు పెండింగ్లో ఉన్నాయని వెంటనే వేతనాల విడుదలకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈవో ని కోరారు. అనంతరం డిఈవో కి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రామస్వామి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మహమూద్ జిల్లా ఉపాధ్యక్షులు అజీజ్, రాములు, జిల్లా కార్యదర్శి రాంరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, నర్సింలు, సత్తయ్య.ఎల్లం, రాములు, రాజేందర్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి లో విదేశీ కొంగల సందడి

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామం లోని వైకుంఠ ధామం పక్కన ఉన్న చెట్ల మీద విదేశీ కొంగలు కిల కిల రావాలతో వింత శబ్దాలతో సందడి చేస్తూ బాటసారులకు వాహన దారులను కను విందు చేస్తున్నాయని పర్యావరణ, ప్రకృతి ప్రేమికులు ప్రభుత్వ టీచర్ తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రతి వేసవి లో సైబీరియా మలేషియా దేశాల నుండి కొన్ని వేల కిలో మీటరు ప్రయాణించి తమకు అనుకూలమైన ప్రదేశాలకు వచ్చి చెట్ల మీద గూడు కట్టుకుని నివాసం ఏర్పాటు చేసుకుంటాయని గుడ్లు కూడా పెడతాయని ఈ కొంగలు ఈ గ్రామానికి అతిథులు అని ఎవరు కూడా వీనికి హాని తలపెట్టవద్దని వారు అన్నారు. వర్షాలు కురవగానే తిరిగి తమ దేశాలకి మళ్లీ కొంగలు వెళ్లిపోతాయని ప్రతి ఒక్కరూ ఈ సందడి చేస్తున్న కొంగలను చూడాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినం సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి లో వున్న జీవజాలాన్ని కాపాడుకోవాలని అన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
శుక్రవారం
5.06.2026

కాంగ్రెస్ ను ఎదుర్కొనే దమ్ములేక నాపై ఆరోపణలు

- అధికారం లేదనే అసహనంతో బిగాల మాట్లాడుతున్నారు
- కమిషన్...కరప్షన్.. కలెక్షన్‌కు అలవాటు పడ్డాడు
- అభివృద్ధి పై చర్చకు సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే బిగాలపై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఫైర్

చట్టం ఇందూరు : అవినీతి, అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ తనపై ఆరోపణలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే బిగాల నగరానికి ఎప్పుడో ఒకసారి వస్తున్నారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత అసహనంతో అవగాహన లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోను 60 స్థానాల్లో ఒకటే సీటును గెలుపొంది, కనీసం ఆ ఒక్క సీటును కూడా కాపాడుకోలేని అసమర్థత నాయకుడు అని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత గతంలో ఉన్న పెండింగ్ పనులపై అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నానన్నారు. ఇది జీర్ణించుకోలేని బిగాల అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

బిగాల పదేళ్లు అధికారంలో ఉన్నా..అర్బన్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇప్పించలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డి ఉన్నాడని, ఆయనకు రాజీనామా చేయమని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. అలాగే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టీ హబ్ లో ఒక్క ప్రముఖ కంపెనీ కూడా తీసుకు రాలేదని మరి కేటీఆర్ ని రాజీనామా చేయమని నిలదీశావా అని ప్రశ్నించారు. కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే పని చేశావే తప్ప..నిజామాబాద్ అభివృద్ధికి కాదని ఎద్దేవా చేశారు. కమిషన్ కరప్షన్ కలెక్షన్ కు అలవాటు పడి పదేళ్లు పాలించాడని విమర్శించారు. ఇటీవల తాను మంత్రులపై ఒత్తిడి తేవడంతో నగరంలో 396 ఇల్లు కేటాయించారన్నారు. అలాగే మరో వారంలో నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ను కలుస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నగరంలోని మినీ ట్యాంకుబండ్ పై బిగాల గణేష్ గుప్తా అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు. ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ సమయం ముగియడంతో తాళాలు వేసి వెళ్లారన్నారు. కొత్త కాంట్రాక్టర్ నియమంచాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం, కార్పొరేషన్ పై ఉందన్నారు. అదే మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన చెట్లలో అవినీతికి పాల్పడ్డ చరిత్ర బిగాలది అన్నారు. నాలుగున్నర వేల ఒక్కో చెట్టును 45 వేలుగా చూయించి దోచుకున్నారన్నారు. అలాగే కార్పొరేషన్ లో ఒక్క మనిషి విధులు నిర్వహించుకున్నా.. 330 మంది పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూయించి నెలకు 50 లక్షలు దోచుకున్నారన్నారు.

చర్చకు సిద్ధం..

ఏ శాఖలో అయినా తాను ఒక్కరూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల గణపతి ఆలయం ముందుకు తాను వస్తానని చెప్పారు. తన హయాంలో ఒక్క గుంట భూమి కొనుగోలు చేయలేదని, బిగాల మాత్రం ఒక్క గుంట కూడా విడిచిపెట్టలేదన్నారు.అలాగే ఆర్యవైశ్యులు అంటే దానధర్మాలకు ప్రతిక అని, కానీ బిగాల మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాడన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి బిజెపి ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, కల్పే అర్చనా చిరంజీవి, మమత శివ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, పుట్ట వీరేందర్, బీజేవైఎం రాష్ట్ర కో కార్యదర్శి విజయ్, ఇల్లెందుల ప్రభాకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెట్ట వరి సాగుతో నీటి పొదుపు – రైతులకు అధిక లాభాలు

చట్టం పోతంగల్/కోటగిరి : పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో డా. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్ట వరి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మెట్ట పద్ధతిలో వరి సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మెట్ట వరి సాగు ద్వారా నీటి వినియోగం గణనీయంగా తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. నీటిపారుదల, విద్యుత్ వినియోగం, పంపుసెట్ల నిర్వహణ ఖర్చులు తగ్గడం వల్ల రైతులపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ పద్ధతిలో నేలలో గాలి ప్రసరణ మెరుగ్గా ఉండటంతో మొక్కల వేర్లు ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు.అలాగే నేల కోత, సార నష్టం తగ్గి భూమి సారవంతత కాపాడబడుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ విధానం దోహదపడుతుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి సంరక్షణ, తక్కువ పెట్టుబడి, స్థిరమైన దిగుబడుల కోసం మెట్ట వరి సాగు ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తోందన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి ఈ సాగు చేపడితే అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో డా. రెడ్డీస్ ఫౌండేషన్ అధికారులు సతీష్, వంశీ, ప్రశాంత్‌తో పాటు రైతులు ముత్యాల రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో జెండా పండుగకు భారీ ఏర్పాట్లు

- 7న పీఎస్ఆర్ గార్డెన్ నుంచి ర్యాలీ.. తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులు

చట్టం కొల్చారం /సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జెండా పండుగను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న సన్నాహక సమావేశాల్లో పార్టీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున పాల్గొంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ఉత్సవాలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. జెండా పండుగ ఉత్సవాల్లో భాగంగా కల్వకుంట్ల కవిత జిల్లా కేంద్రానికి విచ్చేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు పీఎస్ఆర్ గార్డెన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభం కానుంది. ర్యాలీ జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగి తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకోనుంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జెండా పండుగ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జిల్లా ఇంచార్జులుగా బాలయ్య, శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సన్నాహక సమావేశంలో కరుణాకర్, కృష్ణమోహన్, నవీన్, కృష్ణ రెడ్డి, సుధాకర్, నితిన్ కుమార్, సాయికాంత్, గోపాల్ రెడ్డి, మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమ విజయంపై చర్చించారు. జెండా పండుగను ఘనవిజయం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

అనాథ పిల్లలను రోడ్డున పడేసిన ఘటనపై ఆగ్రహం

- తపస్వి స్వచ్ఛంద సంస్థకు అండగా నిలవాలని ప్రజల విజ్ఞప్తి
- యజమానికి వత్తాసు పలుకుతున్న పోలీస్ డిపార్ట్మెంట్
- కలెక్టర్ స్పందించి తక్షణమే పిల్లలకు న్యాయం చేయాలీ

చట్టం ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోనీ మామిడిపల్లి ప్రాంతంలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ తపస్విలో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో ఏళ్లుగా అనాథ, నిరుపేద పిల్లలకు ఆశ్రయం, విద్య, భోజనం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సేవలందిస్తున్న ఈ సంస్థ ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. సంస్థ నిర్వహణ వర్గాల కథనం ప్రకారం, నిధుల కొరత కారణంగా అద్దె చెల్లింపుల్లో జాప్యం ఏర్పడటంతో భవన యజమానిని కొంత గడువు ఇవ్వాలని కోరగా, పోలీసుల సమక్షంలో జూన్ 10వ తేదీ వరకు సమయం ఇవ్వాలని అంగీకారం జరిగినట్లు చెబుతున్నారు. అయితే గడువు ముగియకముందే సదరు భవన యజమాని ప్రభుత్వ ఉద్యోగి, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న హరి జీవన్, కొందరితో కలిసి వచ్చి పిల్లలు నివసిస్తున్న ప్రాంగణాన్ని ఖాళీ చేయిస్తూన్నారన్నారు. గురువారం రోజు 5గురు వ్యక్తులను తీసుకొని వచ్చి పిల్లలు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు, బాత్రూమ్‌లను ధ్వంసం చేశారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన సంస్థ సభ్యుడు శ్రీనివాసరావుపై వారు దాడి చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో చిన్నారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తపస్వి సంస్థకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, దాతలు వచ్చి పిల్లలకు సహాయం అందిస్తూ ప్రోత్సహించిన సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అలాంటి సమయంలో ప్రస్తుతం సంస్థ సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రముఖులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనాథ పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం, జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే పిల్లలకు న్యాయం చేయాలనీ ప్రజలు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు వెంటనే స్పందించి సంస్థకు అవసరమైన సహాయం అందించాలని, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

చట్టం నిజామాబాద్ ప్రతినిధి : నిజామాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వినోద్ సోదరుడు ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాల్దా గ్రామంలో ఎమ్మెల్యే పరామర్శలు

రూరల్ మండలంలోని పాల్దా గ్రామానికి చెందిన గోనె లచ్చన్న సోదరుడు ఇటీవల పరమపదించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కంకల్లా రమేష్ కు మాతృవియోగం కలుగగా.. వారి నివాసానికి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతపూర్ గంగాధర్, ఉమ్మాజి నరేష్, పొలసాని శ్రీనివాస్, మోహన్, శ్యాంసన్, ధర్మాగౌడ్, మోహన్, పాల్దా గ్రామ సర్పంచ్ ప్రభాకర్, జనార్దన్ ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నడం వల్ల నేల సారవంతత పెరుగుతుంది

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : హుజురాబాద్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామ శివారులో రోటరీ మల్చర్ సహాయంతో పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట అవశేషాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాట్లాడిన అధికారులు పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలిపి దున్నడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అవశేషాలు కుళ్లి హ్యూమస్‌గా మారడం వల్ల నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి సారవంతత మెరుగవుతుందని వివరించారు. నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ముఖ్య పోషకాలు తిరిగి నేలలో కలవడంతో పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయని చెప్పారు. అలాగే నేల నిర్మాణం మెరుగుపడి గాలి ప్రసరణ, వేర్ల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. నేలలో తేమ నిల్వ సామర్థ్యం పెరగడంతో నీటి వినియోగం తగ్గుతుందని, ఉపయోగకర సూక్ష్మజీవుల సంఖ్య కూడా పెరుగుతుందని వివరించారు. పంట అవశేషాలు నేలపై కప్పుగా ఉండటం వల్ల గాలి, వర్షాల కారణంగా జరిగే నేల కోతను తగ్గించవచ్చని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నత్రజని, గంధకం వంటి పోషకాలు నష్టపోవడంతో పాటు నేలలోని సేంద్రియ పదార్థం తగ్గిపోతుందని అధికారులు హెచ్చరించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశిస్తాయని, వాయు కాలుష్యం పెరిగి శ్వాసకోశ సమస్యలు, కంటి మంటలు, అలెర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అదనంగా పంట అవశేషాల దహనం వల్ల అగ్నిప్రమాదాల ప్రమాదం పెరగడంతో పాటు గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారం అధికమై పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలిపి దున్నడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజకీయ మోసాలు ప్రజాస్వామ్యానికి ముప్పు

- కార్యకర్తలను మోసం చేసే నాయకులను ప్రజలు తిరస్కరించాలి

చట్టం వికారాబాద్ ప్రతినిధి : రాజకీయ నాయకులు ప్రజల నమ్మకాన్ని, కార్యకర్తల కష్టాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగించుకుని అనంతరం వారిని నిర్లక్ష్యం చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోందని బీసీ సంక్షేమ సంఘం, బీసీ సేన తెలంగాణ రాష్ట్ర న్యాయ విభాగం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆవుటి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి, గెలిచిన తర్వాత వాటిని విస్మరించడం, కార్యకర్తలను పట్టించుకోకపోవడం, అవినీతికి పాల్పడడం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, అయితే నేటి రాజకీయాల్లో కొందరు అధికారాన్ని, సంపదను సంపాదించుకునే సాధనంగా రాజకీయాలను మార్చుకున్నారని విమర్శించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అబద్ధపు హామీలతో ఓట్లు సాధించి, తర్వాత ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఉపాధి, అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో భారీ హామీలు ఇచ్చే నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేయడం, కులమత రాజకీయాలతో ప్రజలను విభజించడం, ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గెలుపు కోసం రాత్రింబవళ్లు శ్రమించిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పదవులు, అవకాశాలు తమ అనుచరులకు లేదా స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా పంచిపెట్టి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టడం రాజకీయాల్లో తరచూ కనిపిస్తున్న దురాచారమని విమర్శించారు. నాయకుల మోసపూరిత వైఖరి వల్ల ప్రజల్లో రాజకీయ వ్యవస్థపై నమ్మకం తగ్గిపోతోందని, అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు నాయకుల మాటలను గుడ్డిగా నమ్మకుండా వారి గత చరిత్ర, పనితీరును పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. యువత రాజకీయాల్లోకి వచ్చి బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని, అవినీతి నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటును అమ్ముకోకుండా, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రాజశేఖర్ ఆవుటి అన్నారు.

డిచ్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం... ఇద్దరు యువకులు దుర్మరణం

- ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్



చట్టం నిజామాబాద్ ప్రతినిధి : నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌పై కామారెడ్డి వైపు నుంచి ఇంద్రాన్‌పల్లి వైపు వెళ్తున్న ఇద్దరు యువకులు డిచ్‌పల్లి సమీపంలోని మలుపు వద్ద ముందుగా వెళ్తున్న ఫోర్డ్ కారును తప్పించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ కమిషనర్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి, రవాణా శాఖ, పోలీసు అధికారులతో సమావేశమై భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదకర మలుపుల వద్ద వెలుతురు సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటన స్థల పరిశీలనలో ఏసీపీ ప్రకాష్, సీఐ వినోద్, ఎస్ఐ ఆరిఫ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

చట్టం న్యూస్, వేములవాడ రూరల్ : సుమారు 11 నెలల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లిన వేములవాడ అర్బన్ నాంపల్లి గ్రామానికి చెందిన దండుగుల రాజయ్య (తండ్రి: లక్ష్మయ్య) అక్కడ అనారోగ్యంతో మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న రాజయ్య అకాల మరణంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ప్రత్యేక చొరవ చూపారు. సంబంధిత శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ గల్ఫ్ బాధిత కుటుంబాలకు అందించే సంక్షేమ పథకాల కింద రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఆయన పట్టుదలతో ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా మొత్తం బాధిత కుటుంబానికి అందడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దండుగుల రాజయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కష్టకాలంలో అండగా నిలిచి ప్రభుత్వ సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. అదేవిధంగా నాంపల్లి 6వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజాసేవా తీరును ప్రశంసించారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించే నాయకుడిగా ఆయన పేరు సంపాదించుకున్నారని, గల్ఫ్ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ కాశం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి ముత్తారం గ్రామవాసికి గాయాలు

చట్టం :శంకరపట్నం : మోటార్ సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తికి గాయాలైన ఘటన శంకరపట్నం మండలంలో చోటుచేసుకుంది పూర్తి వివరాలకు వెళ్తే శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మంద విష్ణుమూర్తి (45) హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఆయన ముత్తారం నుండి మక్త గ్రామంలోని రైస్ మిల్లుకు పని నిమిత్తం వెళ్ళాడు. సాయంత్రం పని ముగించుకుని తిరిగి బైక్‌పై ముత్తారం వస్తుండగా, మార్గమధ్యంలో మోటార్ సైకిల్ అదుపుతప్పింది. దీంతో బైక్ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో విష్ణుమూర్తి కిందపడిపోవడంతో ఆయన ఎడమచేయి మణికట్టు (మట్ట) విరిగింది. శరీరంపై స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే '108' అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ మత్తి గోపికృష్ణలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడికి అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ, మెరుగైన వైద్యం కోసం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మన ఊరి పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలి : హెచ్‌ఎం కంకణాల నీరజ

చట్టం శంకరపట్నం : మన ఊరి విద్యార్థులను మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంకణాల నీరజ గ్రామస్తులకు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మొలంగూర్ గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికీ బడిబాట – కరపత్రాల పంపిణీ

గ్రామంలోని వివిధ కూడళ్లు, వీధుల గుండా ప్రచార రథం మరియు డీజే ద్వారా విద్యా గీతాలను వినిపిస్తూ ఉత్సాహభరిత వాతావరణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయ బృందంతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వసతులు, ఇంగ్లీష్ మీడియం బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల వివరాలను తల్లిదండ్రులకు సవివరంగా వివరించారు. పాఠశాల ప్రగతిని తెలియజేసే కరపత్రాలను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, దాతలు, శ్రేయోభిలాషులు మరియు గ్రామ పెద్దలను హెచ్‌ఎం నీరజ ఈ సందర్భంగా కలిసి, వారి అందిస్తున్న తోడ్పాటుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి.. వారి చదువు, క్రమశిక్షణపై పూర్తి బాధ్యత మాది" అని హెచ్‌ఎం నీరజ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ బడిబాట ర్యాలీ మరియు ప్రచార కార్యక్రమంలో నల్ల వెంకయ్యపల్లి, మొలంగూర్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, ఆశా వర్కర్లు, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధి జహేదా తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు: ఎస్పీ అఖిల్ మహాజన్

చట్టం బోథ్: రైతులను లక్ష్యంగా చేసుకుని రుణాలు, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలు, పంటల కొనుగోలు పేరుతో మోసాలకు పాల్పడుతున్న దళారులు, కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. రైతుల కష్టార్జిత డబ్బును మోసపూరిత పద్ధతుల్లో దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో రైతుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా గత ఏడాది కాలంలో రైతులను మోసం చేసిన వారిపై 25 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నెల రోజుల వ్యవధిలోనే 20 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలు ఇప్పిస్తామని, ప్రభుత్వ పథకాల లబ్ధి కల్పిస్తామని, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు తక్కువ ధరకే అందిస్తామని, పంటలకు అధిక ధరలు ఇప్పిస్తామని చెప్పి ముందస్తుగా డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు లేదా ఇతర సంస్థల పేర్లతో డబ్బులు డిమాండ్ చేసినట్లయితే పూర్తిస్థాయిలో ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, మోసపూరిత కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రైతులతో పాటు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రైతుల ఆర్థిక భద్రతకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు.

CHATTAM NEWS

చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంచేందుకు ఏటీసీ కీలకంగా మారుతుంది

- పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా
- పరకాల పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



చట్టం / పరకాల ; పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు సంబంధించి భూమిని అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంచేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కీలకంగా మారుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. అలాగే పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగానే రాజుపేట సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణ అభివృద్ధికి,యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఏటీసీ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు.

అక్రమాస్తుల కేసులో అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు అరెస్ట్



చట్టం భూపాలపల్లి ప్రతినిధి : తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న) నాయిని భుజంగరావుపై అక్రమాస్తుల కేసు నమోదు చేసింది. తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుబంధ వ్యక్తులకు చెందిన మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ సోదాల్లో సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, ఐదు ఓపెన్ ప్లాట్లు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో ఒక వాణిజ్య భవనానికి సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.3.83 లక్షల నగదు, రూ.8 లక్షల బ్యాంకు డిపాజిట్లు, సుమారు కిలో బంగారు ఆభరణాలు, మారుతి స్విఫ్ట్ కారు, కియా సెల్టోస్ వాహనాలను గుర్తించారు. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ రూ.5.92 కోట్లకు పైగా ఉన్నట్లు వెల్లడించింది. మార్కెట్ విలువ దీనికంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. సోదాల సందర్భంగా భుజంగరావు నివాసంలో 29 మద్యం సీసాలు కూడా లభించడంతో తదుపరి చర్యల కోసం ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించినట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. నిందిత అధికారిని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచి న్యాయ రిమాండ్ కోరనున్నట్లు ఏసీబీ పేర్కొంది.

రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డికి పదోన్నతి

- అదనపు కలెక్టర్‌గా నియామకం.. పెద్దపల్లికి బదిలీ

చట్టం శంషాబాద్ : రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) వెంకటరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో విధులు నిర్వహిస్తున్న ఆయనను అదనపు కలెక్టర్‌గా పదోన్నతి ఇస్తూ పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమోషన్‌తో పాటు రాజేంద్రనగర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజేంద్రనగర్ ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో వెంకటరెడ్డి పరిపాలనా వ్యవహారాల్లో సమర్థవంతంగా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం, ప్రజా సేవల అందుబాటు, పరిపాలనా సమన్వయంలో ఆయన పనితీరు ప్రశంసలు అందుకుంది. పదోన్నతి, బదిలీ నేపథ్యంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు వెంకటరెడ్డికి అభినందనలు తెలియజేస్తూ కొత్త బాధ్యతల్లోనూ విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లాలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించనున్న ఆయన పరిపాలనా అనుభవం జిల్లాకు ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టి ఆర్ ఎస్ మండల కార్యదర్శిగా గోవర్ధన్ రెడ్డి

చట్టం న్యూస్ లింగంపేట్ : లింగంపేట్ మండల టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్ రెడ్డిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సంపత్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు లింగంపేట్ మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డికి మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియామకంపై గోవర్ధన్ రెడ్డి స్పందిస్తూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోకల సాయిరాం, జిల్లా కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జైల్ సింగ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరీ సాయిలు, మండల కార్యదర్శి మహేందర్, ఐలాపూర్ ఉపాధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు లయన్. చిట్టిపెల్లి దేవిక కు ఆహ్వానం

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు, శ్రీశ్రీ కళావేదిక రాజమండ్రి, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా ఈనెల 6 ,7 తేదీలలో నిర్వహిస్తున్నారు. గాయక విభాగము నుండి హనుమకొండకు చెందిన చక్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లయన్. చెట్టిపెల్లి దేవిక కు ఆహ్వానం అందింది. వీరిని లయన్ ప్రతినిధులు పొట్లపల్లి శ్రీనివాసరావు, ఆర్య, శివశంకర్, జి జి వీ వీ అధ్యక్షులు మహేశ్వరం ఉపేందర్, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి తదితరులు దేవికను అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

- దోమకొండ మండలం కృష్ణ మందిర్ వద్ద ఘటన, స్పాట్‌లోనే మృతి

(చట్టం ప్రతినిధి కామారెడ్డి) కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామం నుండి కామారెడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న కొమ్మ మహేష్ అనే వ్యక్తిని కృష్ణ మందిర్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కొమ్మ మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే మొబైల్ పోలీసుల సమాచారం ప్రకారం, ప్రమాదం జరిగిన ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, ఒకవైపు నుండి వాహనాలు సజావుగా వెళ్తున్నాయని తెలిపారు. మృతుడు జీపీఓ (గ్రామ పంచాయతీ ఆపరేటర్) గా పనిచేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి, ఢీకొట్టి వెళ్లిన వాహనం కోసం గాలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మందు బాబులకు జరిమానా

చట్టం ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో బుధవారం రోజు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో టౌన్ లో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 6 గురినీ గురువారం రోజు కోర్టులో హాజరు పరచగా ఐదు గురికీ ఒక్కొక్కరికి పదివేల చొప్పున మొత్తం 500000/ రూపాయల జరిమాన, ఒక్కరికి నాలుగు రోజుల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా హానరబుల్ జెఎఫ్సిఎం మేజిస్ట్రేట్ సరళ రాణి, విధించారని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

మహిళలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక : ఎమ్మెల్యే జారే

- అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేయాలి

చట్టం అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామం అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మహిళా నాయకులకు పిలుపునిచ్చారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మహిళా సమావేశంలో ఆయన పాల్గొని మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు, మహిళా విభాగం నాయకులు, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, పార్టీ మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో ప్రజలతో మరింత అనుబంధం పెంపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో, సామాజిక రంగంలో, ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలే ప్రధాన బలమని, గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మహిళా కార్యకర్తల కృషి ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో గత కొంతకాలంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల, చెరువుల అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు, విద్యా, వైద్య రంగాల్లో చేపడుతున్న చర్యలు, మహిళా సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా పెట్టుకుని పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు వంటి అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్న సందర్భాల్లో వాస్తవాలను ప్రజలకు వివరించాలని మహిళా నాయకులకు సూచించారు.

ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని, గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మహిళలు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పార్టీ నాయకత్వం, ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో ముందుండాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మహిళా నాయకులు వ్యవహరించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, పార్టీ చరిత్ర, ప్రజాస్వామ్య విలువలను యువతకు తెలియజేయడంలో మహిళా నాయకులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో మహిళా కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చూడాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం మహిళా అధ్యక్షులు తో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేకంగా చర్చించి మండలాల వారీగా పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్

చట్టం రామగుండం : మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణమే అమలు చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన జాతీయ మహిళా సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే 33 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరమన్నారు. మహిళా రిజర్వేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మాటలకే పరిమితమైందని విమర్శించారు దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళల భద్రత, సమాన హక్కులు, రాజకీయ అవకాశాల కోసం మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల సమస్యల పరిష్కారం కోసం విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహించి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మడికొండ ఓదెమ్మ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహిళలు కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కనకరాజు, ఆసాలరమ, శనిగరపు తిరుమల, కరీం, శేఖర్, తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే వర్షా కాలంపై మున్సిపల్ ముందస్తు అలర్ట్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి
- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు

చట్టం న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజల ఆరోగ్యం, వార్డుల సమగ్ర ప్రగతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 14, 15, 25వ వార్డుల్లో గురువారం ప్రత్యేక వార్డు సభలను ఏర్పాటు చేశారు. ఈ సభలకు మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వార్డు సభల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటకే పాలనను అందించాలనే సత్సంకల్పంతో ఈ ప్రగతి ప్రణాళికను రూపొందించిందని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పట్టణంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు ప్రజలకు సుదీర్ఘమైన అవగాహన కల్పించారు. దోమల నివారణకు, అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు ఇందిరమ్మ చీరలను ఇదే కార్యక్రమంలో పంపిణీ చేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. ఇంతకుముందు కేవలం మహిళా సంఘం లో ఉన్నటువంటి మహిళలకు మాత్రమే చీరలను పంపిణీ చేశారని కానీ ప్రస్తుతం దానిని సవరించి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరుతూ... ఇండ్ల నుంచి వచ్చే చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై, ఖాళీ స్థలాలలో, మురికి కాలువలలో వేయవద్దని చైర్మన్ హితవు పలికారు. ఇళ్లలోనే తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి, ప్రతిరోజూ ఉదయం వచ్చే మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకే అందించాలని విజ్ఞప్తి చేశారు. వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో త్వరలోనే ప్రత్యేక సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని, డ్రైనేజీల క్లీనింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి చర్యలను మరింత ఉధృతం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ గృహాల ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి, భవిష్యత్తులో వేసవి కాలంలో కూడా నీటి కొరత రాకుండా ఉంటుందని, పరోక్షంగా సకాలంలో వర్షాలు కురవడానికి ఇవి ఎంతో దోహదపడతాయని వివరించారు. వార్డుల అభివృద్ధిపై స్థానికులకు పూర్తి భరోసా ఇస్తూ... వార్డు ప్రజలకు ఎలాంటి మౌలిక వసతుల సమస్యలు ఉన్నా, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే వార్డు అధికారుల దృష్టికి లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ పాల్గొని శాంతిభద్రతలు, వార్డు ప్రణాళికలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ క్షేత్రస్థాయి సిబ్బంది, మెప్మా ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆయా వార్డుల మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సభలను విజయవంతం చేశారు.

కవితమ్మ పాంచజన్యమే తెలంగాణకు శ్రీరామరక్ష: తెలంగాణ రక్షణ సేన

- శంకరపట్నం మండలంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

చట్టం శంకరపట్నం : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్, నియోజకవర్గ ఇంచార్జ్ బుడిగె పర్శారం గౌడ్, అబ్జర్వర్ ఏనుగు మల్లారెడ్డి, వరంగల్ ఇంచార్జ్ ఎలేటి రవికుమార్, సీనియర్ నాయకుడు లింగంపల్లి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారం కంటే రాజకీయ స్వార్థాలకే పాలకులు, ప్రతిపక్షాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న నాయకురాలిగా కవితమ్మ నిలుస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయం, ప్రజా భవన్ ముట్టడిల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. కవితమ్మ ప్రకటించిన 'పాంచజన్యం' ద్వారా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతులకు ప్రోత్సాహకాలు, నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు సామాజిక తెలంగాణ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కవితమ్మ నాయకత్వంలో సర్వోదయ తెలంగాణ ఆవిర్భవిస్తుందని, రాష్ట్ర ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎండి సల్మా, అతహార్, జైపాల్ రెడ్డి, అంకం శివరాణి, శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, బసవేణి రాజేందర్, చెన్నమల్ల చైతన్య, చంటి శ్రీనివాస్, జంగ అపర్ణ, ఐలా ప్రసన్న, కుతాడి రజిత, గుర్రం సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నా ఇటుక బట్టి... నా ఇష్టం! ఎవరు అడ్డు వస్తారో చూస్తా?!

చట్టం రామాయంపేట : మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల్లో నిషేధిత జాతుల కట్టెలను ఇంధనంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, బట్టీల్లో ఇప్ప, మామిడి, చింత, తుమ్మ తదితర నిషేధిత జాతుల కట్టెలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బట్టీ పరిసర ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో కట్టెల నిల్వలు కనిపిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత ఎఫ్ఎస్వోను సంప్రదించగా, ప్రస్తుతం దూర ప్రాంతంలో ఉన్నానని, సాయంత్రం మాట్లాడతానని ఫోన్‌లో సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అదే సమయంలో బట్టీ యజమానిని వివరణ కోరగా తొలుత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అధికారులను సైతం లెక్కచేయనన్న ధోరణిలో మాట్లాడటంతో పాటు పరుష పదజాలం ఉపయోగించినట్లు సమాచారం. అనంతరం కొంతసేపటికే వార్త ప్రచురించవద్దంటూ వివిధ మార్గాల్లో అభ్యర్థించినట్లు తెలుస్తోంది. గ్రామ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా కట్టెల నరికివేత జరుగుతోందని, దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా అటవీ, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలికితీసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, పర్యావరణ ప్రేమికులు, పర్యావరణ పరిరక్షకులు డిమాండ్ చేస్తున్నారు. "నిషేధిత కట్టెల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, పర్యావరణాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలి" అని స్థానికులు కోరుతున్నారు.

బాల్యాన్ని భక్షిస్తున్న లైంగిక నేరాలు.. పెరుగుతున్న పోక్సో కేసులు

- చిన్నారుల భద్రతపై నిపుణుల ఆందోళన – కఠిన అమలుకు డిమాండ్

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : దేశవ్యాప్తంగా చిన్నారులపై లైంగిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోక్సో (పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం) అమలుపై మరోసారి చర్చ మొదలైంది. చిన్నారులను లైంగిక వేధింపులు, దాడులు, దుర్వినియోగం నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 2012లో ఈ ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. 18 సంవత్సరాల లోపు బాలబాలికలపై జరిగే అన్ని రకాల లైంగిక నేరాలకు ఈ చట్టం వర్తిస్తుంది. చట్ట నిపుణుల అభిప్రాయం ప్రకారం, పోక్సో చట్టం కేవలం నేరస్తులకు శిక్ష విధించే సాధనం మాత్రమే కాదు, చిన్నారుల హక్కులను రక్షించే బలమైన న్యాయ కవచంగా కూడా పనిచేస్తోంది. బాధితుల వాంగ్మూలానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం, ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా వేగవంతమైన విచారణ చేపట్టడం, బాధితుల వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచడం వంటి అంశాలు ఈ చట్టంలో ఉన్నాయి. అయితే కేసుల సంఖ్య పెరుగుతుండటం సమాజంలో నైతిక విలువల క్షీణత, కుటుంబ పర్యవేక్షణ లోపం, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం వంటి సమస్యలను కూడా వెలుగులోకి తెస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోక్సో చట్టం ప్రకారం నేర తీవ్రతను బట్టి మూడేళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్షలు విధించే అవకాశం ఉంది. తీవ్రమైన నేరాలకు మరింత కఠిన చర్యలు తీసుకునే వెసులుబాటు కూడా చట్టంలో కల్పించారు. చిన్నారులకు మంచి స్పర్శ – చెడు స్పర్శపై అవగాహన కల్పించడం, పాఠశాలల్లో భద్రతా చర్యలను బలోపేతం చేయడం, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించడం, అనుమానాస్పద సంఘటనలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఇలాంటి నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పోక్సో చట్టం చిన్నారుల రక్షణకు శక్తివంతమైన ఆయుధమే అయినప్పటికీ, చట్ట అమలుతో పాటు సమాజం, కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసినప్పుడే చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి

ఆర్టిఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్ గౌడ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా 9848862801

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

మహిళలకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్లలోని మహిళా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్**

చట్టం/హనుమకొండ; మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్లలోని మహిళా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు, శిక్షణకు సంబంధించిన మెటీరియల్, సెంటర్ లోని వివిధ శిక్షణ విభాగాలను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించి కేంద్రం గురించిన వివరాలను డిఆర్డిఓ మేన శ్రీను, అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహిళలకు ఉపయోగపడే విధంగా వారం రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల సమైక్య కార్యాలయం కోసం శంకుస్థాపన చేసిన భూమి వివరాలను తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రవి యాదవ్, అడిషనల్ డిఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీవో కల్పన, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం

చట్టం పోతంగల్ /కోటగిరి: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత, చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అడవుల ప్రాధాన్యత, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యాసాల రూపంలో వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సురేష్, ఎఫ్బీవో నాగార్జున, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పుష్పాల చిన్న గంగారాం, వార్డు సభ్యులు కోటగిరి సతీష్, నాగరాజు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బడిబాట

చట్టం ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రోజు ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయినిని ఉపాధ్యాయులు కొటార్మూర్ గ్రామ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో నే ప్రవేశం పొందాలని ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని అవగాహన కల్పిస్తూ బడిబాటను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లత ప్రసాద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారులు.. కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

చట్టం బిక్కుంద ; కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిక్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్లో గురువారం ఉదయం తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను గుర్తించి వారి తల్లి కడమంచి అనిత(భర్త రాములు) ఎల్లమ్మ కొచ్చా నివాసి అని గుర్తించి ఇద్దరూ పిల్లలను తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. ఈ సమాచారం అందిన వెంటనే స్పందించి సహకరించిన ప్రజలకు సంబంధిత అధికారులకు బిక్కుంద ఎస్సై రాజు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులు సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నందిపేట్ ఎస్సైగా వినయ్ కుమార్

చట్టం ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండల నూతన ఎస్సైగా వినయ్ కుమార్, కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం రోజు నందిపేట్ ఎస్ ఐ గా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు నందిపేట్ ఎస్సైగా విధులు నిర్వహించిన శ్యాంకుమార్ విఆర్ కు అటాచ్ చేశారు.

రిపుల్స్ పాఠశాలపై MEO కి పిరియదు

చట్టం బిక్కుంద; కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిక్కుంద మండల కేంద్రంలోని కందరపల్లి లోని రిపుల్స్ పాఠశాల యజమాని అనిల్ పాటిల్ వారి పార్టనర్ హనుమంత్ కదం కి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా చట్ట వ్యతిరేకంగా స్కూల్ బిల్డింగ్ నిర్మించారని. ఇంకా బిల్డింగ్ కు DTCP మరియు బిక్కుంద మున్సిపాలిటీ నుండి కూడా ఎలాంటి పరిమితులు లేవని అతను ఆరోపించారు. పాఠశాలను నడిపించడానికి రిజిస్టర్ లీజ్ డీడ్ అవసరం కాగా దానికి బదులుగా డూప్లికేట్ లీజ్ డీడ్ వాడారని దీనికి బిక్కుంద సబ్ రిజిస్టర్ వారి అనుమతి లేదని మరియు బిక్కుంద మున్సిపాలిటీ నుండి ఒరిజినల్ NO Objection Certificate బదులుగా డూప్లికేట్ సర్టిఫికెట్ వాడారని ఆరోపించారు. దీనికి సంబంధించిన పేపర్లు తీసుకొని బిక్కుంద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వారు సిద్ధమయ్యారు. ఇప్పటికే చెక్కు బౌన్స్ కేసులో హనుమంత కదం ను చాలా విధాలుగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించిన ఎలాంటి మార్పు కూడా లేదని వాపోయారు.

విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని లేకుంటే తగిన గుణపాఠం తప్పదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. గురువారం బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధి వర్గం వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ ద్వార ముఖ్యమంత్రి కి వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ ఎన్నికల ముందు బీసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తామని, విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చేసిన వాగ్దానాలన్నీ విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గమన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు టీసీలు మెమోలు ఇవ్వకపోవడంతో పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిల విడుదలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చరా అని ప్రశ్నించారు. వేలాది కోట్ల రూపాయలు వివిధ పథకాల పేరుతో దుబారాగా ఖర్చు చేసిన ప్రభుత్వం విద్యార్థుల ఫీజులకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 7తో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువును అందుబాటులో లేకుండా చేయడమే ప్రభుత్వ విధానంలా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థి వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడి ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేయాలన్నారు. లేనిచో బీసీ సంఘాలన్నీ సమైక్యమై పోరాటాలు ఉద్ధృతంగా నిర్వహిస్తాయని వెంకట్రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు చెలుకల రాజు, కె. చంద్రశేఖర్ పాల్గొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసిల్దార్ శ్రీకాంత్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండాన్ని పంపిస్తానని హామీ ఇచ్చారు.

గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి టీపీసీసీ డీఏసీ షోకాజ్ నోటీసులు

- **ఫిర్యాదులపై స్పందించిన మల్లు రవి, శ్యాం మోహన్‌లకు నేతల కృతజ్ఞతలు**
- **సస్పెండ్ చేయాలని కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్**

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుండి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది.

డీఏసీ చైర్మన్ మల్లు రవికి వినతి

ఇటీవల కామారెడ్డి నియోజకవర్గ నాయకులు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఉపాధ్యక్షుడు శ్యాం మోహన్‌లను కలిసి ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు. అందిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించిన కమిటీ, వివరణ కోరుతూ చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. నోటీసులో పేర్కొన్న అంశాలపై నిర్దిష్ట గడువులోగా లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించింది.

సస్పెండ్ చేయాలని డిమాండ్

ఈ సందర్భంగా కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణను పరిరక్షించడంలో డీఏసీ తీసుకున్న చర్యను పూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. "గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని ఎంత తొందరగా పార్టీ నుండి సస్పెండ్ చేస్తే, అంత తొందరగా పార్టీని కాపాడిన వాళ్లమవుతాం. ఆయనపై చేసిన ప్రతి ఆరోపణకు ఆధారాలు ఉన్నాయి కాబట్టి, ఆయన సస్పెన్షన్ నుండి తప్పించుకోలేరు" అని నాయకులు స్పష్టం చేశారు.

పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి

ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా స్పందించి చర్యలు తీసుకున్నందుకు డీఏసీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఉపాధ్యక్షుడు శ్యాం మోహన్‌లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు విజ్ఞప్తి చేస్తూ, తాము ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. ధన్యవాదాలు తెలిపిన వారిలో కామారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ విభాగాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కామారెడ్డి జిల్లాలో బలమైన గాలులతో అకస్మాత్తుగా భారీ వర్షం

- **మండే ఎండ నుండి ప్రజలకు ఉపశమనం**
- **కొద్ది నిమిషాల్లోనే మారిన వాతావరణం, ప్రజల ముఖాల్లో ఆనందం**

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) వేసవి కాలంలో నెలల తరబడి మండే ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు నేడు ప్రకృతి ఉపశమనం కలిగించింది. కామారెడ్డి జిల్లా కేంద్రం తో పాటు బాన్సువాడలో మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా వాతావరణం మారిపోయి బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురవడం ప్రారంభమైంది. కొద్ది నిమిషాల్లో మాయమైన సూర్యుడు చాలా రోజులుగా ఆకాశంలో నిప్పుల వర్షం కురిపిస్తున్న సూర్యుడు అకస్మాత్తుగా మాయమయ్యాడు. ఆకాశంలో నల్లని దట్టమైన మేఘాలు కమ్ముకొని చల్లని బలమైన గాలులతో కుండపోత వర్షం మొత్తం నగరాన్ని ముంచెత్తింది.

ప్రజల ముఖాల్లో చిరునవ్వు

మండే వేడితో అలసిపోయిన ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. అకస్మాత్తుగా వాతావరణం మారడంతో మార్కెట్లు, వీధులు, ఇళ్లలో ప్రజల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. చిన్నపిల్లలు, పెద్దలు వర్షాన్ని ఆస్వాదిస్తూ కనిపించారు. తీవ్రమైన వేడి తర్వాత కురిసిన ఈ వర్షం ఉష్ణోగ్రతను తగ్గించడమే కాకుండా ప్రజలకు వేడి తీవ్రత నుండి కూడా విముక్తి కలిగించింది.

టీచర్స్ కాలనీ కూలిన కల్వర్టు...

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 43 వార్డులో గల టీచర్స్ కాలనీలో రోడ్ నెంబర్ 2 లో మధ్యాహ్నం పడిన వర్షానికి కల్వర్టు ఒకేసారి కూలిపోయింది. దీనివలన కాలనీ ప్రజలు రాకపోకలు చేయలేకపోయారు. ముందస్తు చర్యలు లేకపోవడం వలన కాలనీలో కల్వర్టు కూలిపోయిందని కాలనీవాసులు తెలిపారు. అధికారులు పలుమార్లు చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అటవీశాఖ పార్కు వినోదానికా.. అశ్లీల కార్యకలాపాలకు నిలయమా?

- **రూ.2 కోట్లతో నిర్మించిన పార్కులో అసాంఘిక కార్యకలాపాలపై సందర్శకుల ఆందోళన**

చట్టం – పెద్దపల్లి : రామగుండం నియోజకవర్గ పరిధిలో కుందనపల్లి ఐఓసీ సమీపంలోని గుట్టల ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కులో అసాంఘిక, అసభ్యకర కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలు, వృద్ధులు ప్రశాంత వాతావరణంలో విహరించేందుకు ఏర్పాటు చేసిన ఈ పార్కు ప్రస్తుతం వివాదాలకు కేంద్రబిందువుగా మారిందని ఆరోపిస్తున్నారు. పార్కులో ప్రవేశానికి ఒక్కొక్కరికి రూ.20, వాహనాల పార్కింగ్‌కు మరో రూ.20 చొప్పున రుసుము వసూలు చేస్తున్నప్పటికీ, నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని సందర్శకులు పేర్కొంటున్నారు. పార్కు ప్రాంగణంలో బీరు సీసాలు, మద్యం సీసాల అవశేషాలు, అసభ్యకర వస్తువులు కనిపిస్తున్నాయని, దీంతో కుటుంబాలతో వచ్చే సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. ప్రత్యేకంగా సాయంత్రం వేళల్లో పార్కులో కొన్ని అనుచిత ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులతో వెళ్లిన వారు అక్కడి పరిస్థితులను చూసి నిరాశతో వెనుదిరుగుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. పార్కు భద్రతా సిబ్బంది, సంబంధిత అధికారులు ఈ పరిస్థితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాజీవ్ రహదారి పక్కన, ప్రకృతి అందాల నడుమ, రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న ఈ పార్కు ప్రారంభంలో ప్రజల ప్రశంసలు అందుకుంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఆ లక్ష్యాలను నీరుగార్చేలా ఉన్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పార్కులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అటవీశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సందర్శకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల కోసం నిర్మించిన ఈ పార్కును తిరిగి కుటుంబాలకు అనుకూలమైన వినోద కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు.

జాతీయ జెండా ఆకారంలో కేక్ కటింగ్

- **చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు**

చట్టం కోటగిరి : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు జాతీయ జెండా ఆకారంలో కేక్ తయారు చేసి కేక్ కటింగ్ చేయడం ద్వారా జాతీయ పతాకాన్ని అపమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, దానిని కేక్ రూపంలో తయారు చేసి కట్ చేయడం దేశ గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భావిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా జాతీయ జెండాను పార్టీ జెండాగా వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు, స్టేటస్‌లు పెట్టడం దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు.
ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు సభలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

చట్టం/పరకాల ; ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరకాల మున్సిపల్ పరిధిలోని 5, 6, 7, 8 17 వ వార్డులలో వార్డు సభలను నిర్వహించడం జరిగింది. ఇట్టి వార్డు సభలలో ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలపై,ప్రభుత్వ పథకాలపై చర్చించడం జరిగింది.వార్డు ప్రజలను నుంచి అభిప్రాయాలను సేకరించడం,వార్డు అభివృద్ధి మరియు వార్డుకు అవసరమైన పనులను గుర్తించడం,వార్డు సమస్యలపై చర్చించి పథకాల అమలు గురించి వార్డు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్,మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్,స్థానిక కౌన్సిలర్లు గొడుగు రజిత తుమ్మల రాణి నల్ల కుమార్ బొచ్చు సుభద్ర,మున్సిపల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి,వార్డు ఆఫిసర్స్ మరియు వార్డులలోని ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి టీపీసీసీ డీఏసీ షోకాజ్ నోటీసు

- **7 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం - జూన్ 11 డెడ్‌లైన్**
- **పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు, 13 ఎఫ్ఐఆర్‌లు, భూకబ్జా ఆరోపణలు**

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది.

ఎంపీ మల్లు రవి, శ్యామ్ మోహన్ సంయుక్త నోటీసు

డీఏసీ చైర్మన్, ఎంపీ డాక్టర్ మల్లు రవి మరియు డీపీసీ ఉపాధ్యక్షుడు శ్యామ్ మోహన్ అనంతుల సంయుక్తంగా ఈ నోటీసు జారీ చేశారు. కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలకు సంబంధించిన పత్రికా కథనాల ఆధారంగా ఈ చర్య తీసుకున్నారు.

తీవ్ర ఆరోపణలు - 13 ఎఫ్ఐఆర్‌లు

పేలుడు పదార్థాలతో సంబంధించిన కేసు, మున్సిపాలిటీలోని పాత సామాను అమ్మిన కేసు, భూ కబ్జాలపై కేసుతో పాటు అతనిపై దాదాపు 13 ఎఫ్ఐఆర్‌లు, 420 కేసులు ఉన్నాయని ఆరోపణలు వచ్చినట్లు నోటీసులో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన ఆధారాలు కూడా కమిటీ దృష్టికి వచ్చాయి.

సీనియర్ నేతపై వ్యాఖ్యలు

పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడిపై చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించాయనే ఆరోపణలు కూడా నోటీసులో ఉన్నాయి.

జూన్ 11లోగా వివరణ ఇవ్వాలి...

తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయి లిఖితపూర్వక వివరణను ఏడు రోజులలోగా, అంటే 11 జూన్ 2026లోపు డీఏసీకి సమర్పించాలని నోటీసు ద్వారా ఆదేశించారు. ఫిర్యాదులు మరియు ప్రాతినిధ్యాల ప్రతులను కూడా నోటీసుకు జతచేసినట్లు టీపీసీసీ డీఏసీ వెల్లడించింది. వివరణ అందిన అనంతరం పార్టీ నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలపై కమిటీ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

జనగణన దేశాభివృద్ధికి పునాది

- **ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొని సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

చట్టం/హనుమకొండ; జనగణన దేశ అభివృద్ధికి పునాది వంటిదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించేందుకు ఇది అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో జనగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తన కుటుంబ వివరాలను నమోదు చేయించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుందని తెలిపారు. అందువల్ల ప్రజలు ఎటువంటి సందేహాలకు తావివ్వకుండా ఎన్యూమరేటర్లకు పూర్తి, ఖచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. ప్రతి కుటుంబం ఈ జాతీయ కార్యక్రమంలో బాధ్యతగా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం: బుల్లెట్‌ను ఢీకొట్టిన కంటైనర్, ఇద్దరు మృతి

- **44వ జాతీయ రహదారిపై డిచ్‌పల్లి వద్ద ఘటన**

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) నిజామాబాద్ జిల్లాలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డిచ్‌పల్లి వద్ద హైదరాబాద్ నుండి ఆర్మూర్ వైపు వెళ్తున్న బుల్లెట్ బండిని వెనుక నుండి వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది.

అక్కడికక్కడే దుర్మరణం

వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో బుల్లెట్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

నూతన డిఇఓకు సన్మానం చేసిన టిటియు

(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) నూతనంగా బదిలీ పై వచ్చిన జిల్లా విద్యాశాఖాధికారి, కామారెడ్డి L. మల్లికార్జున్ ను గురువారం "తెలంగాణ టీచర్స్ యూనియన్ (టి.టి.యు.)", కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువ తో సన్మానం చేశారు . ఈ కార్యక్రమంలో అధ్యక్షులు Md. ముజిబొద్దీన్, ప్రధాన కార్యదర్శి కాంఙ్గె గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండ్రె శ్రీనివాసులు, మహిళా సెక్రటరీ షాహెదా పర్వీన్, ఉపాధ్యక్షులు ఇష్రత్ నుల్తానా, ఉపాధ్యాయులు అంత్యోదయ్, నాగ్ నాథ్ , పాల్గొన్నారు

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం – జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(చట్టం ప్రతినిధి కామారెడ్డి) 136 గ్రామపంచాయతీలలో గ్రామసభలు - జయజయహే తెలంగాణ గీతంతో ప్రారంభం వర్షాకాలం ముందస్తు చర్యలు, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కామారెడ్డి, జూన్ 4: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 532 గ్రామపంచాయతీలలో విడతల వారీగా ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో గ్రామసభలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గొట్టుముక్కులలో కలెక్టర్ పర్యటన

గురువారం జిల్లాలోని 136 గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. దోమకొండ మండలం గొట్టుముక్కుల గ్రామపంచాయతీలో జరిగిన గ్రామసభకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హాజరయ్యారు. జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామసభ జయజయహే తెలంగాణ గీతంతో ప్రారంభమైంది.

వర్షా కాల ముందస్తు చర్యలకు ఆదేశం

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

వ్యర్థాల నిర్వహణకు 4 రంగుల బుట్టలు

ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్-2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు గ్రామసభల ద్వారా ఎంపిక

తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, SIR2026, పంటల మార్పిడి, బడిబాట, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రైతులు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు.

-బిక్నూర్‌లో మహిళలకు ఉచిత రక్త పరీక్షలు ప్రారంభం

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కలెక్టర్ ప్రారంభం

బిక్నూర్: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బిక్నూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్, రక్త పరీక్షల తీరును పరిశీలించారు. రక్తహీనత వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందాలని మహిళలకు సూచించారు. మహిళా సంఘాల సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవీందర్, సర్పంచ్, తహసీల్దార్, DRDO దామోదర్ రెడ్డి, adl DRDO విజయలక్ష్మి, మండల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విక్టర్

అదనపు కలెక్టర్ విక్టర్ గురువారం కామారెడ్డి మండలం పాత రాజంపేట గ్రామం PACS వరి కొనుగోలు కేంద్రాన్ని DCSO, DMCS, DCOతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం తాడ్వాయి మండలం దెమికలాన్ గ్రామంలోని PACS మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని DCOతో కలిసి పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నర్కుడ గ్రామాభివృద్ధికి రూ.60 లక్షలు

- సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

చట్టం, శంషాబాద్ : నర్కుడ గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా గ్రామ పంచాయతీ నిధులతో సుమారు రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని చెప్పారు. గ్రామంలో వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకత్వాన్ని స్థానికులు అభినందించారు. గ్రామాభివృద్ధి పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా గణనీయంగా తగ్గనున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌట రాజు, తొంట జంగమ్మ, కనకమామిడి విష్ణు, కుంచ లతకుమార్ గౌడ్, బుర్కుంట నాగరాజు, పర్వతం వినోద్, లింగం సంధ్యనవీన్, గూడెపు నీరజలక్ష్మణ్, కరె అఖిలగణేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామ నాయకులు నీరటి శేఖర్, తొంట అశోక్, చందనవెల్లి శ్రీనివాస్, నీరటి అశోక్, టి. కుమార్ గౌడ్, హిరేకర్ శివాజీ, గడ్డం మల్లేష్ యాదవ్, రక్షిత్ గౌడ్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష

చట్టం /హనుమకొండ; పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మరింత వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఆర్‌డీఓలు మేన శ్రీను, నాగ పద్మజతో పాటు సంబంధిత శాఖల అధికారులతో పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (NDDB) అధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, పరకాల మహిళా డెయిరీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. డెయిరీ అభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డెయిరీ కార్యకలాపాల విస్తరణ, పాల సేకరణ కేంద్రాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన, సభ్యుల నమోదు తదితర అంశాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్య శారద డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టి, ప్రణాళికాబద్ధంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు రాధాకిషన్, బాలకృష్ణ, అడిషనల్ డీఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, డీపీఎంలు సరిత, వరలక్ష్మి, మెప్మా కోఆర్డినేటర్లు రజిత రాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ ఆవిర్భావ దినోత్సవానికి ఘన ఏర్పాట్లు

- రాహుల్ గాంధీకి ఆహ్వానం.. ఇందిరా గాంధీ సేవలపై జాతీయ సదస్సు

చట్టం శంషాబాద్ : దేశంలోనే రెండో వ్యవసాయ విశ్వవిద్యాలయంగా 1964 జూన్ 12న రాజేంద్రనగర్‌లో స్థాపించబడిన వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 12న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భారత హరిత విప్లవ సాధనలో ఇందిరా గాంధీ పాత్ర, సేవలను స్మరించుకుంటూ జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ఉపకులపతి అల్దాస్ జానయ్య వెల్లడించారు. 1966లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం సహా పలు మౌలిక వసతులను ప్రారంభించి రైతాంగానికి అంకితం చేసిన నేపథ్యంలో, ఆ చారిత్రక ఘట్టానికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ ప్రధానోపన్యాసాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి అందించనుండగా, ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త మధురా స్వామినాథన్ జాతీయ సదస్సులో కీలకోపన్యాసం చేయనున్నారు. అలాగే పార్లమెంటేరియన్, విధాన విశ్లేషకుడు ఉందవల్లి అరుణ్ కుమార్ ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు.

రాహుల్ గాంధీకి ఆహ్వానం

విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ప్రారంభమై 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఆహ్వానం పంపినట్లు ఉపకులపతి తెలిపారు. అలాగే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించాలని కోరినట్లు వెల్లడించారు.

మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో వేడుకలు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 1966 నుంచి 1984 వరకు దేశంలో హరిత విప్లవాన్ని విజయవంతంగా అమలు చేసి ఆహార భద్రత సాధనలో కీలక పాత్ర పోషించిన ఇందిరా గాంధీ నాయకత్వం, రైతు అనుకూల విధానాలు, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడిన సంస్థలను ఈ సందర్భంగా స్మరించుకోవడం అవసరమని ఉపకులపతి అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగ చరిత్రలో విశ్వవిద్యాలయం పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ, రైతాంగానికి మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అతి గతి లేని ఆర్టీఐ బోర్డులు.. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం?



చట్టం రామాయంపేట : రామాయంపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ దరఖాస్తుల ద్వారా సమాచారం కోరిన వారికి నెల రోజుల తర్వాత కూడా సరైన సమాచారం అందించడం లేదని దరఖాస్తుదారులు ఆరోపించారు. కోరిన వివరాలకు బదులుగా సంబంధంలేని సమాధానాలు ఇస్తున్నారని వారు విమర్శించారు. తుని గండ్ల శివారులోని సర్వే నంబర్ 94 మొత్తం విస్తీర్ణం ఎంత అనే సమాచారాన్ని కోరగా, కార్యాలయం నుంచి సర్వే నంబర్ 94/1కు సంబంధించిన వివరాలు పంపినట్లు తెలిపారు. దీంతో ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6(1), 8(1)(j)లను ప్రస్తావిస్తూ కోరిన సమాచారం ఇవ్వలేమని పేర్కొన్నారని తెలిపారు. అయితే తాము వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన పత్రాలు గానీ, దేశ రక్షణ, నిఘా సంస్థలు లేదా భద్రతా అంశాలకు సంబంధించిన సమాచారాన్ని గానీ కోరలేదని స్పష్టం చేశారు. ఇదే విషయంపై ఆర్డీవో కార్యాలయం నుంచి పొందిన సమాచారం, తహసీల్దార్ కార్యాలయం ఇచ్చిన వివరాలకు భిన్నంగా ఉండటంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు చట్టబద్ధంగా అందాల్సిన సమాచారాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఇవ్వడం సరికాదని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, కోరిన సమాచారాన్ని వెంటనే అందించాలని వారు కోరారు.

గోదావరిఖని బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

- బస్టాండ్‌లో అవ్యవస్థపై అసంతృప్తి.. నిర్వహణపై డిపో మేనేజర్‌కు ఎమ్మెల్యే హెచ్చరిక

చట్టం, రామగుండం : గోదావరిఖని బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక 36వ డివిజన్ పరిధిలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో సీసీ రోడ్డు విస్తరణ, ప్లాట్‌ఫామ్ మరమ్మతులు, సానిటరీ పైప్‌లైన్‌ల ఏర్పాటు, బస్టాండ్ ఆవరణలో పెయింటింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతిరోజూ బస్టాండ్‌ను వినియోగించే వేలాది మంది ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఈ పనులు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించిన ఎమ్మెల్యే, బస్టాండ్ లోపల మరియు పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ కారణంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, బస్టాండ్ చుట్టూ అవ్యవస్థకు తావులేకుండా నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ కల్వల పద్మావతి, రంజిత్, గడ్డం రమాదేవి, శ్రీనివాస్, నెలకంటి రాము, దూళికట్ట సతీష్, తాళ్లపల్లి యుగంధర్, చిరురాల నాగరాజు, చుక్కల లావణ్య, శ్రీనివాస్, కర్రావుల డేవిడ్ రాజు, డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

"కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలం, రేవంత్ రెడ్డి ముఖం చూసేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు": ప్రశాంత్ రెడ్డి

- "కేసీఆర్ పాలన జనరంజకం, ఇప్పుడు దోపిడీ పాలన"
- రైతు డిస్కంల ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్

(చట్టం ప్రతినిధి కామారెడ్డి) కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రాష్ట్రంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, విస్తృత స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు

"సీఎం టీవీలో కనిపిస్తే చాలు ప్రజలు టీవీలు కట్టేస్తున్నారు. రేవంత్ రెడ్డి ముఖం చూడటానికే ప్రజలు ఇష్టపడటం లేదు. అబద్ధాల కోరుగా, దుర్మార్గుడిగా, చేతకాని సీఎంగా, మోసకారిగా ప్రజల దృష్టిలో మిగిలిపోయాడు" అని ఆయన విమర్శించారు.

కేసీఆర్ హయాంను గుర్తు చేస్తూ

"పదేళ్ల పాటు కేసీఆర్ జనరంజక పాలన అందించారు. రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలు ఎలా ఉండేది, ఇప్పుడెలా ఉందో ప్రజలే బేరీజు వేసుకోవాలి. యూరియా సరఫరా అప్పటి పరిస్థితి, ఇప్పటి పరిస్థితి చూడాలి. రైతులంటే రేవంత్ రెడ్డికి అంత చులకన ఎందుకు?" అని ప్రశ్నించారు.

కరెంట్ కోతలపై ఆరోపణ : గతంలో 24 గంటలు వచ్చిన విద్యుత్ ఇప్పుడు 11 గంటలకు పడిపోయిందని, దీంతో తెలంగాణలో మళ్లీ మోటార్లు కాలిపోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

అవినీతి ఆరోపణలు : "సీఎం, మంత్రులు రాష్ట్రంపై గద్దల్లా వాలిపోతున్నారు. వేల కోట్ల విలువైన భూములను దోచుకుంటున్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన 14 ఎకరాల భూమిని ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. సివిల్ సప్లై, ఎక్సైజ్ శాఖలో రూ.6 వేల కోట్ల కుంభకోణం జరిగింది. వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 116 ఎకరాల భూమిపై కూడా కన్నేశారు" అని ఆరోపించారు.

రైతు డిస్కంలపై అభ్యంతరం : "రైతు డిస్కం పేరుతో దోపిడీకి తెరలేపారు. ఆదాయం వచ్చే డిస్కంలను ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోంది. కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు చేసింది. ఫ్యాక్టరీలు, కమర్షియల్ నుండి వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం వినియోగించేవారు. కానీ ఇప్పుడు ఆదాయం వచ్చేవి ప్రైవేటుకు, నష్టాలు వచ్చేవి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రైతు డిస్కంల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

కేంద్రంపై విమర్శలు : "కేంద్రం తెలంగాణకు నయాపైసా ఇవ్వడం లేదు. పైగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతోంది. హైదరాబాద్ చుట్టూ నిర్మించే ఆర్.ఆర్.ఆర్ ప్రాజెక్టును కేంద్రం రిజెక్ట్ చేసింది. రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ఆర్.ఆర్.ఆర్ ను ఎందుకు రిజెక్ట్ చేశారో కిషన్ రెడ్డి ప్రశ్నించాలి" అన్నారు.

గంప గోవర్ధన్: "కేసీఆర్ ఓటమి కామారెడ్డికి తీరని మచ్చ" : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. "నియోజక వర్గ అభివృద్ధి కోసం ఇక్కడి నుండి పోటీ చేసిన మాజీ సీఎం కేసీఆర్ ఓడిపోవడం కామారెడ్డికి తీరని మచ్చ. ఈ మచ్చను చెరిపేసేలా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. "30 నెలలుగా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది. దేవుళ్ల మీద ఒట్టు వేసి అమలు చేయలేని దౌర్భాగ్యపు సీఎం రేవంత్ రెడ్డి. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది" అని విమర్శించారు. "కేసీఆర్ హయాంలో రూ.8 కోట్లతో డిగ్రీ కళాశాల మైదానంలో శంకుస్థాపన చేస్తే, ఇప్పుడు ఇంచార్జి మంత్రి సీతక్క ఇందిరాగాంధీ స్టేడియంలో శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల క్రితం మంజూరైన స్టేడియం పనులు ఇప్పటికీ మొదలు పెట్టకపోవడం సిగ్గుచేటు. కేసీఆర్ తెచ్చిన రూ.23 కోట్ల నిధులతో పనులు చేస్తూ తామే తెచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం విడ్డూరం" అని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ షిండే తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ రేట్ల పెంపునకు మేం ఒప్పుకోం

- కార్మికుల పేరుతో బెదిరిస్తే క్రిమినల్ కేసులే
- బిల్డర్ల సమస్యలు తీర్చాలని ప్రభుత్వానికి టీబీఎఫ్ విజ్ఞప్తి
- మాదాపూర్‌లో బిల్డర్ల అత్యవసర సమావేశం

చట్టం, సైబరాబాద్

సెంట్రింగ్ కార్మికుల రేట్ల పెంపును తాము ఎక్కడా సమర్థించలేదని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. కార్మికుల పేరుతో సైట్ల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించింది. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో మంగళవారం జరిగిన టీబీఎఫ్ కార్యనిర్వాహక వర్గ అత్యవసర సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు సి. ప్రభాకర్ రావు మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులు సైట్లకు వచ్చి బిల్డర్స్ అసోసియేషన్ రేట్లు పెంచిందని చెబుతూ అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. క్రెడాయ్, నరెడ్కో, టీబీఎఫ్ ఏ అసోసియేషన్ కూడా రేట్లు పెంచినట్లు ఎవరికీ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో రేట్ల పెంపును వ్యతిరేకిస్తున్నామని, ఇది బిల్డర్, కాంట్రాక్టర్ మధ్య వ్యక్తిగత వ్యవహారమని చెప్పారు. కార్మికుల హెల్త్ కార్డు, ఈఎస్ఐ, ప్రమాదాల్లో ఎక్స్‌గ్రేషియా విషయాల్లో మాత్రం అన్ని అసోసియేషన్లు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ల వ్యవహారంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పుల వల్ల బిల్డర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిసిటీ శాఖ మార్పులతో మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పొందడంలో జాప్యం అవుతోందని, కొనుగోలుదారుల నుంచి ఒత్తిడి వస్తోందని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన మార్కెట్ విలువల పెంపులో ల్యాండ్ రేట్లు పెంచడంలో ఇబ్బంది లేదని, కానీ అపార్ట్‌మెంట్ ఎస్ఎఫ్‌టీ రేట్ల విషయంలో పునరాలోచించాలని కోరారు. ఎస్ఎఫ్‌టీ రేట్లు పెరిగితే కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ, జీఎస్టీ భారం పడుతుందని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాదిరి అఫర్డబుల్ హౌసింగ్ స్కీమ్ కింద స్టాంప్ డ్యూటీ తగ్గించాలని, మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తే మరో 1 శాతం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొంది ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఉన్న భవనాలను కూడా 22ఏ జాబితాలో చేర్చారని, ఈ పొరపాట్లను సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్న బిల్డర్ల మనుగడ కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు ఇస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రగతి నగర్ బిల్డర్స్ అసోసియేషన్ నుంచి వి.శ్రీనివాస్, బి.రాజారెడ్డి, నారాయణరెడ్డి; గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ నుంచి మిరియాల రాఘవరావు, కె.రాజారెడ్డి, పి.బి.ఎస్.విశ్వనాథ్, సమ్మెట ప్రసాద్, శశిధర్ రెడ్డి, స్వప్న శ్రీనివాస్; ఉప్పల్ అసోసియేషన్ నుంచి ఆకుల సత్యనారాయణ, ఎస్.రమేష్, జక్కా వెంకటరెడ్డి, సీహెచ్.మురళి, పద్మాకర్ రెడ్డి; ఈస్ట్ జోన్ నుంచి టి. నరసింహారావు; కూకట్‌పల్లి జోన్ నుంచి కే. చక్రపాణి, బి. గోపాల్, యోగేంద్ర సింగ్; గ్రేటర్ ఈస్ట్ జోన్ నుంచి టి. విద్యాసాగర్, మధు, రమేష్ బాబు, మోహన్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001.,
and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com